బృహదీశ్వర స్వామి అలంకరణలో..



గౌతంనగర్: కార్తీక మాసం సందర్భంగా వాణీనగర్ విజయ వినాయక ఆలయంలో శనివారం బృహదీశ్వర స్వామి(తంజావూరు) అలంకరణలో ఉమామహేశ్వర స్వామిగా భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు.

నృత్యం.. మనోహరం..



ఉప్పల్: ఉప్పల్ శిల్పారామంలో శనివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా అర్చన గూటి శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పలు అంశాలను భవ్య, సహస్ర, కృతి, కీర్తన, హంసిని, ప్రవళిక ప్రదర్శించి మెప్పించారు. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, ఆట డాన్స్ అకాడమి డైరెక్టర్ విజయ్ కుమార్ విచ్చేసి కళాకారులను అభినందించారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- ఆర్‌వో అభిషేక్ అగస్త్యా

ఉప్పల్: బోగారంలో ఆదివారం నిర్వహించనున్న ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉప్పల్ నియోజకవర్గ ఎన్నికల అధికారి అభిషేక్ అగస్త్యా (ఐఏఎస్) తెలిపారు. మొదటగా పోస్టల్ బ్యాలెట్‌ను ఉదయం 8 గంటలకు లెక్కించనున్నట్లు తెలిపారు. 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. మొత్తం 22 టేబుల్స్.. ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది అందులో మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్‌తో పాటు ఆయా పార్టీల ఏజెంట్లు ఉంటారన్నారు. సర్వీస్ ఓటర్లు 158 ఉండగా అందులో 24 మంది మాత్రమే ఓటును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ కౌంటింగ్ ప్రక్రియ అనుకున్న ప్రకారం జరిగితే మధ్యాహ్నం వరకు పూర్తి ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

ఈవీఎంల్లో లెక్క తేలితే కానీ భవిత

నిన్నటి వరకు నరాలు తెగిపడే ఉత్కంఠతతో ఎన్నికల ఫలితాల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తుండగా నేటితో ఉత్కంఠతకు తెరపడనుంది. ఉప్పల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం కీసర భోగారంలోని హోలిమేరి కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉప్పల్‌లో అన్ని పార్టీల అభ్యర్థులు నువ్వా.. నేనా? అనే తీరుతో ఫలితాల కోసం వేచిచూస్తున్నారు. ఎవరు గెలుస్తారో ఖచ్చితంగా చెప్పలేని విధంగా ఓటర్లు తీర్పుచెప్పారు. ఈవీఎంల్లో లెక్క తేలితే కానీ భవిత తెలియదు.

ఎన్నికల విజయోత్సవాలపై నిషేధం

- సీఐ మహేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఆదివారం 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, విజయోత్సవ ర్యాలీలు, రాజకీయ వేడుకలు నిర్వహించరాదని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఫలితాల అనంతరం భాణాసంచా కాల్చరాదని, సాంస్కృతిక కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు, డీజే, బ్యాండ్ సౌండ్ చేయరాదన్నారు. గుంపులుగా తిరగడం, ఓడిన పార్టీ అభ్యర్థుల కార్యకర్తలను అపహాస్యం చేయడం, ఇళ్ల వద్ద కవ్వింపు చర్యలకు పాల్పడటం, అవహేళన చేయరాదన్నారు. సామాజిక మాధ్యమాల్లో అభ్యంతకర పోస్టులు పెట్టరాదని, గెలిచిన అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు విజ్ఞత పాటించాలని కోరారు.


రామలింగేశ్వర స్వామి సేవలో..

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి సేవలో శనివారం మేడ్చల్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఐఏఎస్ అధికారిణి పూర్వా గార్గ్ పాల్గొన్నారు. సాయంత్రం కీసరగుట్టకు చేరుకున్న ఆమెకు ఆలయ వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన శ్రీస్వామి వారి(శివలింగం) ప్రత్యేక పూజల అనంతరం ఆలయ వేదపండితులు ఆమెకు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్ ఆలయ విశిష్టతను తెలియజేశారు.

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

కీసర: భోగారం హోలీమేరి కళాశాల్లో ఆదివారం ఉదయం ఐదు అసెంబ్లీ(మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, కూకట్‌పల్లి)ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని కీసర సీఐ వెంకటయ్య తెలిపారు. కీసర మీదుగా వయా భోగారం మీదుగా ఘట్‌కేసర్ వెళ్లే వాహనాలను భోగారం వయా ఓఆర్ఆర్ సర్వీస్ రహదారి మీదుగా ఘట్‌కేసర్ చేరుకునే విధంగా వాహనాల మళ్లింపు ఉంటుందని, అదేవిధంగా ఘట్‌కేసర్ నుంచి భోగారం వయా కీసరకు చేరుకునే వాహనాలను ఘట్‌కేసర్ వయా ఓఆర్ఆర్ సర్వీస్ రహదారి మీదుగా కీసరకు చేరుకునే విధంగా వాహనాల మళ్లింపు ఉంటుందని, ఈ రహదారుల మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని, ఆదివారం ఉదయం 6 గంటల నుండే ఈ ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు.


ఘనంగా ఉర్సు



మేడ్చల్: పట్టణంలోని హజ్రత్ జిందా షా మాధార్ రహమతుల్లా అలై దర్గాలో ఉర్సు ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. సందల్(గంధం) దర్గా షరీఫ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి చాదర్‌ను సమర్పించారు. చాదర్ సమర్పణ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముస్లిం పెద్దలు లాయక్‌అలీ, మహమ్మద్ అబ్దుల్ బారీ పాల్గొన్నారు.

మల్కాజి'బరి'లో గెలుపెవరిది?

- ఆనవాయితీ కొనసాగేనా.. లేదా..?
- ముగ్గురూ గతంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చెందిన వారే..
- ఎవరికి వారే.. ధీమా వ్యక్తం చేస్తున్న నాయకులు



మల్కాజిగిరి నియోజకవర్గం

మల్కాజిగిరి: మల్కాజిగిరి అసెంబ్లీ బరిలో గెలుపెవరిదో అన్న ఉత్కంఠకు మరి కొన్ని గంటల్లో తెరపడనుంది. కాంగ్రెస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బీఆర్ఎస్ నుంచి మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ నుంచి రాంచందర్‌రావు పోటీలో ఉన్నారు. సుమారు 4,89,043 మంది ఓటర్లు ఉండగా 2,64,189 ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. ఈసారి మహిళలు (1,29,754) కంటే పురుషులు (1,34,435) ఎక్కువ మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు.

లెక్కలపై ధీమా..

మూడు పార్టీలు బూత్‌ల వారీగా వచ్చిన ఓటింగ్ లెక్కలను చూసుకొని ఎవరికి వారే గెలుపు తమదే అన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ స్లమ్స్ ఏరియాలో 55 శాతం, కాలనీల్లో 45 శాతం ఓటింగ్ వచ్చిందని ఖచ్చితంగా తమ నాయకుడు మైనంపల్లి హన్మంతరావే గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ స్లమ్స్ ఏరియాలో 60 శాతం, కాలనీల్లో 40 శాతం ఓటింగ్ వచ్చిందని మర్రి రాజశేఖర్‌రెడ్డి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందడం ఖాయమంటున్నారు. నియోజకవర్గం ఏర్పడిన తర్వాత మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ పార్టీ ఇచ్చిన అవకాశంలో మరోమారు పోటీలో ఉన్న బీజేపీ అభ్యర్థి రాంచందర్‌రావు ఈసారి ఖచ్చితంగా గెలుపొందుతారని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. బీసీని ముఖ్యమంత్రి చేస్తామని పార్టీ ప్రకటించడం, ఎస్సీ వర్గీకరణపై మోదీ భరోసాతో పాటు కాలనీల్లో జరిగిన ఎక్కువ పోలింగ్‌తో పాటు వివాదరహితుడైన రాంచందర్‌రావుకు ప్రస్తుత మల్కాజిగిరి నియోజకవర్గంలో ఉన్న పరిస్థితులు కలిసి వస్తాయని భావిస్తున్నారు.

ఆనవాయితీ కొనసాగేనా..?

కంటోన్మెంట్ నియోజకవర్గంలో భాగంగా ఉన్న మల్కాజిగిరి, అల్వాల్ ప్రాంతాలను కలిపి 2009లో మల్కాజిగిరి నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, 2014 టీఆర్ఎస్ నుంచి గెలిచిన చింతల కనకారెడ్డి మరో ఎమ్మెల్యేగా ఉండే అవకాశం రాలేదు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఈసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. ఆయన తిరిగి గెలుపొందితే రికార్డు సృష్టించినట్లే.. ముగ్గురు అభ్యర్థులు గతంలో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన వారే కావడం గమనార్హం.

కాంగ్రెస్ అధికారం ఖాయం: మైనంపల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ప్రజలను పది సంవత్సరాల నుంచి మభ్యపెడుతూ వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. పేదలకు కనీస అవసరాలను తీర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఊహించని విధంగా కాంగ్రెస్‌కు ఆదరణ వచ్చిందని, కనీసం 70 సీట్లు వస్తాయని 85 వరకు కూడా రావొచ్చన్నారు. భవిష్యత్‌లో డబ్బులతో రాజకీయాలు ఉండవద్దని యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామిని కోరుకున్నట్లు చెప్పారు. పేదలు కూడా రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బులు, న్యాయానికి ఈసారి పోరాటం జరిగిందని, న్యాయమే గెలుస్తుందన్నారు. అసైన్డ్ భూములను బినామీ పేర్ల మీద పాస్ బుక్‌లు జారీ చేశారని, ఆ విధంగా జారీ చేసిన కలెక్టర్లు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన







బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన జీవన్ సాగర్ ఎగ్జిబిషన్ ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా నిత్యం తిలకిస్తూ ఆనందాన్ని పొందుతున్నారు. నిత్యం బిజీగా ఉండే నగర శివారు ప్రజలు ఆట విడుపుగా ఎగ్జిబిషన్‌కు వచ్చి ఎంజాయ్ చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు నారాయణ వెల్లడించారు. జాయింట్ వీల్, బ్రేక్ డాన్స్, సోలాంబో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్ ఎంతో ఆకట్టుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. మహిళలు, యువతులతో నిత్యం జ్యూవలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, స్టాయిల్స్ స్టాల్స్, డ్రైఫ్రూట్స్ స్టాల్స్, ఆల్ వెరైటీ ఫుడ్స్ స్టాల్స్‌ను సందర్శించి అవసరం ఉన్న వారు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా అండర్ వాటర్ ట్యూనల్ అక్యురియమ్ మొదటిసారి ఏర్పాటు చేయడం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఇది అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటోంది. నీటి అడుగున సొరంగ ప్రదర్శన, రెండు వేల చేపలతో ప్రత్యేక ఆకర్షణీయంగా ఉందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తున్న ఈ జీవన్ సాగర్ ఎగ్జిబిషన్‌ను బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, పోచారం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాలు

కాప్రా: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాలు మూడు రోజులుగా ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ మానసిక దివ్యాంగుల స్కూల్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. వివిధ వేషధారణలో విద్యార్థులు చేసిన పాత్రలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం కాప్రా, నేతాజీనగర్, ఈసీఐఎల్, నేరేడ్‌మెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. దివ్యాంగుల భావాలను వ్యక్తపరుస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కరపత్రాలు పంచుతూ విద్యార్థులు ర్యాలీగా వెళ్లారు. దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా వారికి కూడా అవకాశం కల్పించి సమాజంలో సమానత్వం పాటించాలని అనురాగ్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ కోరారు. దివ్యాంగుల హక్కులను ప్రోత్సహించడం, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమ అనంతరం దివ్యాంగ విద్యార్థులకు బిందు స్వీట్లు, బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిగూడ అనురాగ్ స్కూల్‌లో..

మానసిక ప్రశాంతతకు మార్గం ఆధ్యాత్మిక చింతన



కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

మల్కాజిగిరి: మానవ జీవితంలో ప్రశాంతతకు ఆధ్యాత్మిక చింతన ఒక మార్గంలా ఉపయోగపడుతుందని మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 23వ తేదీ మల్కాజిగిరి బృందావన్ గార్డెన్స్‌లో జరిగే ద్వితీయ వార్షిక ద్వాదశ ఆవృతి సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చింతన పెంపొందించడం కోసం ఇటువంటి సామూహిక కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు.

ప్రాశ్చాత్య దేశాల్లో రోగులు త్వరగా స్వాంతన పొందడానికి లలితా సహస్ర నామపారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం వినిపిస్తున్నారని సైంటిఫిక్‌గా రుజువైందన్నారు. భావి తరాల్లో కూడా మన పిల్లలకు వీటిని ఉచ్చరించడం నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దుర్గారామ్, ప్రభుగుప్తా, సుధాకర్‌గుప్తా, సునీల్‌రెడ్డి, ఉష తదితరులు పాల్గొన్నారు.

విజయయాత్రలో ప్రముఖ పాత్ర నైపుణ్యానిదే..

ప్రొఫెసర్ సత్యనారాయణ

ఘట్‌కేసర్: ఉద్యోగ అవకాశాల కోసం విద్యార్థులు నూతన కోర్సులు, ఆధునిక సాంకేతికతపై దృష్టి సారించాలని ప్రొఫెసర్ సత్యనారాయణ అన్నారు. కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శనివారం నిర్వహించిన 'స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసమే కాకుండా బంగారు భవిష్యత్ కోసం, ఆచరణాత్మక నైపుణ్యం పెంపొందించుకునేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ తోడ్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ స్కిల్ డెవలప్‌మెంట్ నిపుణుడు దర్పణ్ వాసుదేవ్, సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉదయ్‌కిరణ్, సంస్కృతి విద్యాసంస్థల కార్యదర్శి మల్లాది రమాకాంత్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలం సింగ్, ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన బీఎల్ఆర్



సీఎం కేసీఆర్‌తో బండారి లక్ష్మారెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి



దుర్గామాత ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఉప్పల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీదుర్గామాత ఆలయంలో..

మల్లాపూర్: కేఎల్‌రెడ్డినగర్- హెచ్‌సీఎల్ నగర్‌కాలనీలోని శ్రీదుర్గామాత దేవాలయం సప్తమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి, దుర్గామాత హోమం ప్రధాన అర్చకుల చేత నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నేత కటార్ల భాస్కర్ హాజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సి.రాధాకిషన్‌రావు, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లా మహేందర్‌రెడ్డి, వి.బ్రహ్మయ్య, వెంకట్‌రెడ్డి, యాకుబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూసఫ్ దర్గాలో ప్రార్థనలు



నాంపల్లి యూసఫ్ దర్గాలో ప్రార్థనలో బండారి లక్ష్మారెడ్డి

ఎన్నికల ఫలితాల్లో భారీ మెజార్టీతో గెలుపొందాలని నాంపల్లి యూసఫ్ దర్గాలో ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ప్రార్థనలు చేశారు. మైనార్టీ నాయకులు బ్రదుద్దీన్, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు కటార్ల భాస్కర్, సాయిజెన్‌శేఖర్, మహబూబ్, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, మాక్బూల్, సయ్యద్ షేక్, రఫిక్, నజీర్, ఖాదర్, ఇర్ఫాన్, జియా అక్రమ్, హాజీ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

మల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని బీఆర్ఎస్ యూత్ నేత ఎస్వీ శశి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మల్లాపూర్‌లోని నందీశ్వరాలయంలో బండారి లక్ష్మారెడ్డి గెలుపొందాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ యూత్ కమిటీ సభ్యులు పీఆర్, పృథ్వీ, సోను, ప్రేమ్, ప్రసాద్, చైతన్య, వెంకట్, అజయ్, రాజు, శ్రీధర్, రాఖీ, ప్రసాద్, రిషీ తదితరులు పాల్గొన్నారు.



నందీశ్వరాలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ యూత్ కమిటీ సభ్యులు